సూర్య
www.suryaa.com
ఎన్టీఆర్ - కృష్ణా
మంగళవారం 5 నవంబర్ 2024 పేజీలు 8


### అర్జీల పరిష్కారానికి అధికారులు

## ప్రాధాన్యత నివ్వాలి

### జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ




**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసంలో వచ్చిన అర్జీల పరిష్కారానికి అధికారులు ప్రాధాన్యత నివ్వాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ కలెక్టరేట్లో సోమవారం మీకోసం నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. కోర్టుదిక్కర కేసులలో జాప్యం చేయరాదని, వకాలత్‌లు దాఖలు చేయడంలో జాప్యం చేయడం పట్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఇరిగేషన్ అధికారులను మిగతా 2లో...

# కలిసికట్టుగా పని చేద్దాం



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** కృష్ణాజిల్లా అభివృద్ధికి అందరం కలిసికట్టుగా కృషి చేద్దామని కృష్ణాజిల్లా ఇన్చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. జిల్లాలో వివిధ శాఖల అభివృద్ధి కార్యక్రమాలపై ఇంచార్జ్ మంత్రి సోమవారం స్థానిక జిల్లా పరిషత్ మీటింగ్ హాల్లో సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, బందరు పార్లమెంటు సభ్యులు వల్లభనేని బాలశౌరి, రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్, వర్ల కుమార్ రాజా, కాగిత కృష్ణ ప్రసాద్, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్ రావు, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో ఇన్చార్జి మంత్రి 2

**కృష్ణాజిల్లా అభివృద్ధే ధ్యేయం**

**సీఎం విజన్‌తో 20 లక్షల ఉద్యోగాలు కల్పన**

**రాష్ట్రంలోని నియోజకవర్గాల్లో ఇండస్ట్రియల్ కారిడార్లు ఏర్పాటు**

**ఇన్‌చార్జ్ మంత్రి వాసంశెట్టి సుభాష్**



## అభివృద్ధి, సంక్షేమాన్ని గమనిస్తున్నారు

### ప్రజలు స్వచ్ఛందంగా టీడీపీ సభ్యత్వాన్ని స్వీకరిస్తున్నారు

### 21వ డివిజన్ టీడీపీ నాయకులు గొర్రిపర్తి నామేశ్వరరావు

**కృష్ణలంక, మేజర్ న్యూస్ :** ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గమనిస్తున్న ప్రజలు స్వచ్ఛందంగా టీడీపీ సభ్యత్వాన్ని స్వీకరిస్తున్నాని 21వ డివిజన్ టీడీపీ నాయకులు గొర్రిపర్తి నామేశ్వరరావు అన్నారు. సోమవారం 21వ డివిజన్‌లో ఆయన ఆధ్వర్యంలో టీడీపీ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి మిగతా 2లో...

### యాదవ కళ్యాణ మండపం నిర్మాణం

## ఎన్నో సంవత్సరాల కల

### వచ్చే కార్తీక మాసంలోగా పూర్తి చేస్తాం

### రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర



**మచిలీపట్నం మేజర్ న్యూస్:** నగరంలో యాదవ కళ్యాణ మండపం నిర్మాణం ఎన్నో సంవత్సరాల కలని అది నెరవేరుతోందని, తన వంతుగా రూ.25 లక్షలు సమకూరుస్తానని, వచ్చే కార్తీక మాసంలోగా పూర్తి చేస్తామని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. కృష్ణా జిల్లా కేంద్రమైన మచిలీపట్నం నగరంలోని బలరామునిపేట గాంధీనగర్ పాఠశాల సమీపంలో రూ.50 లక్షల సి ఎస్ ఆర్ నిధులతో తాత్కాలిక మిగతా 2లో



## నమ్మి మోసపోవద్దు

### సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే వసంత

### పాలిథిన్ సంచుల్లో పత్తిని తేవద్దని, జ్యుట్ సంచుల్లో తీసుకోవాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి

**జి.కొండూరు మేజర్ న్యూస్ :** రైతులు పత్తి పంటను సీసీఐ కోనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలని మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు రైతులకు సూచించారు. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దన్నారుమైలవరంలో స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) పత్తి కొనుగోలు కేంద్రాన్ని శాసనసభ్యులు కృష్ణప్రసాదు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ రైతులతో పత్తి దిగుబడులు, గిట్టుబాటు ధర, సీసీఐ నిబంధనల గురించి మాట్లాడారు. రైతులు విక్ర యించడానికి తీసుకువచ్చిన పత్తిని పరిశీలించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు కృష్ణప్రసాదు మాట్లాడుతూ 2లో..

(మొదటిపేజీ తరువాయి)



## అర్జీల పరిష్కారానికి అధికారులు ప్రాధాన్యత నివ్వాలి

మందలించారు. మీకోసం అర్జీలలో గుడివాడ బేతవోలుకు చెందిన దివ్యాంగ బాలిక కృష్ణశ్రీ, బందరు మండలం తుమ్మలచెరువు గ్రామానికి చెందిన దివ్యాంగ బాలిక తలుపుల అక్షర తమకు వికలాంగుల పెన్షన్ 6000 వస్తున్నాయని, లేవలేని స్థితిలో ఉన్న వీరికి ప్రభుత్వం పెంపు చేసిన 15వేల రూపాయల పింఛను మంజూరు చేయించాలని కోరుతూ వారి తల్లిదండ్రులు మీకోసంలో అర్జీలు సమర్పించగా, మెడికల్ వెరిఫికేషన్ చేయించి అర్హత మేరకు వీరికి పెంపు చేసిన పింఛన్ మంజూరుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. మచిలీపట్నం విజయవాడ జాతీయ రహదారి విస్తరణలో ప్రభుత్వం సేకరించిన భూములకు నష్టపరిహారం బకాయిలు చెల్లించాలని కోరుతూ ఉయ్యూరు మండలం గండిగుంట గ్రామస్తులు అర్జీలు సమర్పించారు. జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, డి ఆర్ ఓ ఇంచార్జ్ శ్రీదేవి, బందర్ ఆర్డీవో కే స్వాతి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. డిఎం అండ్ డాక్టర్ జి గీతాబాయి, డీఎస్ఓ వి పార్వతి, డిపిఓ జె అరుణ, డిఎం సివిల్ సప్లై సృజన, డ్వామా పిడి శివప్రసాద్, మున్సిపల్ కమిషనర్ బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమాన్ని గమనిస్తున్నారు



బొప్పన భవకుమార్, రాష్ట్ర నాయకులు గన్నే ప్రసాద్(అన్నా) పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి భవకుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించి అనేకమందికి వాటి ప్రయోజనం గురించి వివరించి నమోదు చేసుకునేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు రంగారావు, నాయకులు గోగుల రమేష్, నడికొప్పుల రవి, మల్లేష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## నమ్మి మోసపోవద్దు



పత్తికి క్వింటాకు ఒక్కింటికి రూ.7,521 ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించిందన్నారు. 8 శాతం తేమ ఉన్నప్పుడే ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర చెల్లించడం జరుగుతుందన్నారు. తేమ శాతం పెరిగితే మద్దతు ధర తగ్గుతుందన్నారు. 9 శాతానికి రూ.7,445.79లు, పది శాతానికి రూ.7,370.58లు, 11 శాతానికి రూ.7,295.37లు, 12 శాతానికి రూ.7,220.16లు చెల్లిస్తారని పేర్కొన్నారు.రైతులు పత్తిని పాలిథిన్ సంచుల్లో తీసుకురావద్దని, పత్తిని జ్యుట్ సంచుల్లో లేదా విడిగా మాత్రమే తీసుకురావాలని సూచించారు. పాలిథిన్ సంచుల్లో పత్తిని నింపి రవాణా చేయడం వల్ల, పాలిథిన్ పత్తిలో జిన్నింగ్ అయ్యి నాణ్యత తగ్గుతుందన్నారు. దీనివల్ల నష్టం జరుగుతుందన్నారు. కాబట్టి రైతులు పత్తి రవాణాకు పాలిథిన్ సంచులు వాడవద్దని సూచించారు.రైతులు తమ పత్తిని తేమ శాతం తక్కువగా ఉండేలా ఆరబెట్టి, చెత్తాచెదారం లేకుండా శుద్ధి చేసి సమీపంలోని కొనుగోలు కేంద్రంలో విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి రైతుల నష్టపోకుండా చూడాలన్నారు. సీసీఐ బయ్యర్లు, ఎన్డీఏ మహాకూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# కలిసికట్టుగా పని చేద్దాం



(మొదటిపేజీ తరువాయి)

పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బి, ఉపాధి హామీ, ఇరిగేషన్ ఆర్డబ్ల్యూఎస్, బందరు పోర్ట్, ఫిషింగ్ హార్బర్ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఇన్చార్జ్ మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోనప్పటికీ, ముఖ్యమంత్రి ఉపముఖ్యమంత్రి ఒకవైపు సంక్షేమ పథకాలు అమలు చేస్తూ మరోవైపు అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు తీసుకెళుతున్నారని అన్నారు. ముఖ్యమంత్రి విజన్తో నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగాలు కల్పన లక్ష్యంగా రాష్ట్రంలో 175 నియోజకవర్గాల్లో ఇండస్ట్రియల్ కారిడార్లు ఏర్పాటు చేయడంతో పాటు, ఐటీ సెక్టర్ని అభివృద్ధి చేసి ఉపాధి ఉద్యోగ మార్గాలు కల్పించడం ధ్యేయంగా పనిచేస్తున్నట్లు తెలిపారు అదే విధంగా కృష్ణా జిల్లాలో మల్లవల్లి పారిశ్రామిక వాడను మోడల్ ఇండస్ట్రియల్ కారిడారుగా 1122 ఎకరాల్లో అభివృద్ధి చేయడం లక్ష్యమన్నారు. కృష్ణా జిల్లాలో అన్ని రోడ్లను గుంతలు లేని రహదారులుగా అభివృద్ధి చేసేందుకు రు.14.76 కోట్లతో 239 కి.మీ. పొడవైన 45 రోడ్లు డిసెంబర్ లోగా పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో ప్రధాన ప్రాజెక్టులు మచిలీపట్నం పోర్ట్, ఫిషింగ్ హార్బర్ పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసుకునేలా ప్లాన్ చేసుకోవాలని, నెల రోజుల్లో మరోసారి రోజంతా అన్ని శాఖలు సమీక్షిస్తామన్నారు. రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి ప్రజలు 94% మాండేట్ ఇచ్చారని సుపరిపాలన గుడ్ గవర్నెన్స్ అందించాలని ముఖ్యమంత్రి ఆలోచన అన్నారు ప్రతి జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలు పరుగులు పెట్టించేందు కు ప్రతి జిల్లాకు ఇన్చార్జి మంత్రిని నియమించి వివిధ జిల్లాలలో అభివృద్ధి కార్యక్రమాలు సమీక్షిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఈరోజు కృష్ణాజిల్లా అభివృద్ధి కార్యక్రమాలపై ఇన్చార్జి మంత్రి సమీక్షిస్తున్నట్లు తెలిపారు. బందరు పోర్టు మన అందరి లక్ష్యం అన్నారు. తాళ్లపాలెం వద్ద బ్రిడ్జి నిర్మించినప్పటికీ అప్రోచ్ లేక నిరుపయోగంగా ఉందని అందుబాటులోకి తేవాలన్నారు. మండలంలో 34 పంచాయతీల్లో జలజీవన్ మిషన్ కింద ప్రతి ఇంటికి తాగునీటి పంపులు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని ప్రభుత్వ శాఖలు ఐదేళ్లలో చేయాల్సిన పనులు ప్రతి ఏడాది ప్రాధాన్యత క్రమంలో చేపట్టుటకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు.

బందరు పార్లమెంటు సభ్యులు వల్లభనేని బాలశౌరి మాట్లాడుతూ ఇరిగేషన్, డ్రైనేజీ, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ ఈ నాలుగు శాఖల అధికారులు, శాసనసభ్యులతో చర్చించి, ఆయా నియోజకవర్గాలలో చేపట్టవలసిన అభివృద్ధి పనులు ప్రాధాన్యత క్రమంలో చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కలెక్టరు అధికారులకు సూచించారు. పంచాయతీరాజ్ ద్వారా చేపట్టే పనులు సమీక్షలో కేంద్ర రాష్ట్ర నిధుల లభ్యతను బట్టి కొన్ని పనులు నాబార్డులో కూడా పెట్టాలని సూచించారు. గత ఐదేళ్లలో రైతులు తాము పండించిన పంట ఇంటికి తేవడానికి డొంక రోడ్లు సరిగా లేక ఇబ్బందులు పడ్డారని, డొంక రోడ్లు అభివృద్ధి చేయుటకు ప్రణాళిక సిద్ధం చేయాలని అన్నారు. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం కారణంగా కృష్ణ వరద ప్రభావం ఎక్కువగా ఉందని, 12 లక్షల క్యూసెక్కుల వరద తట్టుకునే విధంగా కరకట్ట బలోపేతం చేయాలని, వచ్చే ఏడాది ఇలాంటి పరిస్థితి ఏర్పడకుండా ముందస్తు ప్రణాళికలతో డ్రైనేజీ వ్యవస్థ ఆధునికరించాలన్నారు. జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ వివిధ శాఖల అభివృద్ధి పై పిపిటి ప్రజెంట్ చేశారు. ఈ సమావేశం మినిట్స్ రికార్డు చేసి ఆయా శాఖలు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి మంగళవారం అన్ని శాఖల ఇంజనీరింగ్ విభాగాలతో సమావేశం నిర్వహించి సమీక్షిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఇన్చార్జి డిఆర్ఓ శ్రీదేవి, జెడ్పి సీఈవో కన్నమ నాయుడు, వివిధ శాఖల అధికారులు, ఆర్డీవోలు పాల్గొన్నారు.

# యాదవ కళ్యాణ మండపం నిర్మాణం ఎన్నో సంవత్సరాల కల





(మొదటిపేజీ తరువాయి)

అంచనా వ్యయంతో నిర్మించనున్న యాదవ కల్యాణ మండపాన్ని మంత్రి కొల్లు రవీంద్ర, రాష్ట్ర గృహ నిర్మాణం సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, ఎంపీ వల్లభనేని బాలశౌరిలతో కలిసి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ కళ్యాణ మండపం పూర్తి చేయుటకు 3 కోట్ల రూపాయలు అవసరం ఉందని, ఇందుకోసం బీసీ కార్పొరేషన్ నుండి మరో ఒకటిన్నర కోటీ రూపాయలు మంజూరు అయ్యేలా తన వంతు కృషి చేస్తానన్నారు. తన మామయ్య పేరుతో 10 లక్షల రూపాయలు తన వంతుగా మరో 15 లక్షల రూపాయలు వెరసి 25 లక్షల రూపాయలను కళ్యాణ మండపం భవన నిర్మాణానికి సమకూరుస్తానని అన్నారు.ఎంపీ వల్లభనేని బాలశౌరి చొరవ వలన యాదవుల కల్యాణ మండపం నూరు శాతం పూర్తవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వచ్చే కార్తీక మాసంలోగా కళ్యాణ మండపం తప్పనిసరిగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. నగరంలో బీసీ భవన్ ఏర్పాటు కోసం జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అలాగే అంబేద్కర్ భవన్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వ సామాజిక న్యాయం నిధులను తెచ్చేందుకు ఎంపి బాలాశౌరి కృషి చేస్తున్నారన్నారు. నగరంలో ఆవులు, గేదెలు సంచరిస్తు ప్రమాదాలు జరుగుతున్న దృష్ట్యా స్థానిక యాదవ సోదరుల విజ్ఞప్తి మేరకు ప్రమాదాల నివారణకు ఆవులు గేదెలను ఒక షెడ్డులో ఉంచే విధంగా గోకులాల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. రాష్ట్ర గృహ నిర్మాణం సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ శ్రీ కృష్ణ యాదవ కళ్యాణ మండపానికి తన వంతు సహాయంగా 15 లక్షల రూపాయల సొంత నిధులను అందజేస్తానని రాష్ట్ర గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి ప్రకటించారు. కళ్యాణ మండపం పూర్తి చేయుటకు ఇంకా ప్రభుత్వం నుండి మరికొన్ని నిధులు సమకూరుస్తామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి తో సహా మానవ వనరుల శాఖ మంత్రి లోకేష్ కు యాదవుల పట్ల వారి మనసులో ప్రత్యేక స్థానం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సమస్యలతో ఉన్నప్పటికీ నిధుల కోసం వారిని అడుగుదామని, వారు సానుకూలంగా స్పందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. యాదవులకు, గొర్రెల కాపర్లు, కల్లుగీత కార్మికులు, మత్స్యకారులు, దళితులు తదితర బలహీన వర్గాల ప్రజలకు బ్యాంకులు నుండి తక్కువగా ఆర్థిక సహాయం అందుతుందని వీలైనంత ఎక్కువ ఆర్థిక సహాయం వారికి అందించేలా చూడాలని మంత్రి లోకేష్ ను కోరడం జరిగిందన్నారు. అందులకు మంత్రి సానుకూలంగా స్పందించి బ్యాంకర్లతో సమావేశం నిర్వహించి వారికి విరివిగా రుణాలు అందించేలా చూస్తామన్నారు.రాజకీయాలకతీతంగా కళ్యాణ మండపం బ్రహ్మాండంగా అందరికీ ఉపయోగపడే విధంగా నిర్మించాలని, విష్వక్షపాతంగా ఒక కమిటీని ఏర్పాటు చేసి కళ్యాణ మండపాన్ని త్వరగా పూర్తి చేస్తామన్నారు. ప్రస్తుతం నిధులు సమకూర్చిన ఎంపీ బాలశౌరికి అభినందనలు తెలియజేస్తున్నానన్నారు. ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు మాట్లాడుతూ చాలా కాలంగా ప్రయత్నం చేస్తున్నప్పటికీ యాదవ కళ్యాణ మండపం మధ్య మధ్యలో ఆగిపోతూ వచ్చిందని నేడు మంచి రోజు మొదలైందని ఇక కళ్యాణ మండపం నిర్మాణం నిర్విఘ్నంగా సాగుతుందని చెప్పారు తదుపరి మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న నేడు రూపుదిద్దుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. యాదవ కళ్యాణ మండపం నిర్మాణానికి ఇప్పటికే 50 లక్షల.రూపాయలను ఇండియన్ ఆయిల్ కంపెనీ నుండి సిఎస్ఆర్ నిధుల కింద సమకూర్చామన్నారు. మరో 55 లక్షల రూపాయలను ఎన్ హెచ్ పి సి లిమిటెడ్ వారి నుండి మంజూరు లేఖను తీసుకొచ్చామన్నారు. ఇవి కాక మరో 25 లక్షల రూపాయలను తన ఎంపీ లాడ్స్ నుండి కేటాయించి మొత్తం వెరసి 1.30 కోట్ల రూపాయలతో బ్రహ్మాండంగా యాదవ కళ్యాణ్ మండపాన్ని తీర్చిదిద్దుతామన్నారు. యాదవుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. మన అందరి ఆరాధ్య దైవం, యధువంశీ అయిన శ్రీ కృష్ణుని పేరునే కళ్యాణ మండపానికి పెట్టాలని ఎంపి బాలశౌరి సూచించగా అందరు హర్షధ్వానాలతో స్వాగతించారు.ఈ కార్యక్రమంలో గుడివాడ మాజీ శాసనసభ్యులు రావి వెంకటేశ్వరరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రొండి కృష్ణ యాదవ్ మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, ఏపీ ఈ డబ్ల్యూ ఐ డి సి ఈఈ ఎన్ రాయన్న, డి ఈ రంగనాథ స్వామి, స్థానిక ప్రముఖులు బండి రామకృష్ణ బచ్చుల బోసు చల్లపల్లి సుబ్రహ్మణ్యం తదితర అధికారులు అనధికారులు పాల్గొన్నారు.

# ఉచిత మెగా వైద్య శిబిరంలో 400 మందికి వైద్య సేవలు



## ఘనంగా మదర్ సర్వీస్ సొసైటీ స్వచ్ఛంద సేవ సంస్థ కార్యాలయం ప్రారంభోత్సవం

**రెడ్డిగూడెం, నవంబర్ 4, మేజర్ న్యూస్ :** ప్రముఖ జర్నలిస్ట్ మదర్ సర్వీసెస్ సొసైటీ స్వచ్ఛంద సేవ సంస్థ ఫౌండర్ డాక్టర్ మల్లాది ప్రసాదరావు ఆధ్వర్యంలో సోమవారం ఎన్టీఆర్ జిల్లా రెడ్డిగూడెం మండల కేంద్రంలో మదర్ సర్వీస్ సొసైటీ స్వచ్ఛంద సేవ సంస్థ నూతన కార్యాలయాన్ని జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మైలవరం నియోజవర్గం ఇంచార్జ్ అక్కల రామ్మోహన్ రావు (గాంధీ) చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కల గాంధీ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా మదర్ సర్వీస్ సొసైటీ స్వచ్ఛంద సేవ సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలు అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాయని, అనాథలకు అభాగ్యులకు సేవ చేయడం గొప్ప అత్యంత అభినందనీయమని ఆయన ప్రశంసించారు. నిరాశ్రయులకు, పేదవారికి, అన్నదానం, వస్త్ర దానం, ఉచిత వైద్య శిబిరాలు ద్వారా చేస్తున్న సేవ కార్యక్రమాలు మానవత్వానికి నిదర్శనంగా నిలుస్తుందని పేర్కొన్నారు. మానవ సేవే మాధవ సేవ అన్న మాటను నిజం చేస్తు చూపిస్తున్న విరి సేవలు మరువలేనివి అన్నారు. నిరంతరము సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. తమవంతు సహకారం మదర్ సర్వీస్ సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థకి ఎల్లప్పుడూ ఉంటుందని మంచి కార్యక్రమాలకి తోడుగా ఉంటామని అన్నారు. సంస్థ అధ్యక్షులు డాక్టర్ మల్లాది ప్రసాదరావు మాట్లాడుతూ నిరుపేదలకు, నిరాశ్రయులకు సేవ చేయటం అదృష్టం అని తమ సేవా సంస్థ నిర్వహించే సేవ కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా ఉమ్మడి కృష్ణా జిల్లాలో ప్రసిద్ధి చెందిన నిమ్రా హాస్పటల్ సీఈవో డాక్టర్ కాకర్ల విశ్వ చరణ్ ఆధ్వర్యం లో 400 మందికి ఉచిత మెగా హెల్త్ క్యాంపు నిర్వహించి గుండె,కిడ్నీ,షుగరు, బిపి, టుడి ఏకో, జనరల్ సర్జరీ,జనరల్ మెడిసిన్ దీర్ఘకాల వ్యాధులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్డిగూడెం మండల తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గోగులమూడి రవీందర్ రెడ్డి, జనసేన పార్టీ రెడ్డిగూడెం మండల అధ్యక్షుడు చాపలమడుగు కాంతారావు, సారిక కన్సల్టెన్సీ డైరెక్టర్ సిహెచ్ నాగేశ్వరావు, జనసేన మైలవరం మండల అధ్యక్షులు శీలం బ్రహ్మయ్య, హ్యూమన్ రైట్స్ నేషనల్ ప్రెసిడెంట్ బొడ్డపాటి దాస్, నిమ్రా హాస్పటల్ వైద్య నిపుణులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## పైపులైనుకు మరమ్మత్తులు చేయండి మహా ప్రభో..

**జగ్గయ్యపేట, నవంబర్ 4, మేజర్ న్యూస్ :** పైపులైన్ లీకేజీ కారణంగా గత కొన్ని నెలలుగా పైప్ లైన్ ద్వారా లీకైన నీటితో రోడ్డు బురద మయంగా మారి నిత్యం ఎవరో ఒకరు ప్రమాదానికి గురై గాయాల పాలవుతున్నారని తక్షణమే పైప్ లైన్ మరమ్మతులు చేపట్టాలని పుట్టం పుల్లారావు, సిపిఎం పార్టీ నాయకులు కోరారు. మండలంలోని షేర్ మహమ్మద్ పేట గ్రామంలో పుట్టం పుల్లారావు హోటల్ జగ్గయ్యపేట వెళ్లే అడ్డరోడ్డు వద్ద భూమిలోని వాటర్ పైపులైను లీకేజీ అయ్యింది. ఈ విషయంపై అనేకసార్లు గ్రామపంచాయతీ అధికారులకు చెప్పినప్పటికీ ఉపయోగం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ షేక్ నాగులుకు విషయాన్ని వివరించారు. దీంతో తక్షణమే స్పందించిన జూనియర్ అసిస్టెంట్ నాగులు సంఘటన స్థలం వద్దకు వచ్చి పరిశీలించారు. ఈ సందర్భంగా తక్షణమే పైప్ లైన్ మరమ్మతులు చేపడతామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు కోటా కృష్ణ, దంతాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు

## విద్యార్థినులకు ఏకరూప దుస్తులు అందజేసిన ఎమ్మెల్యే

### లంకా లితీష్ జన్మదినం సందర్భంగా దుస్తులు వితరణ



**జి కొండూరు మేజర్ న్యూస్ :** మైలవరం పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల (గర్ల్స్ హై స్కూలు)లో 40 మంది విద్యార్థినులకు ఏక రూప దుస్తులను (యూనిఫామ్) మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు సోమవారం పంపిణీ చేశారు. మైలవరం నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు శ్రీలంకా లితీష్ జన్మదినాన్ని పురస్కరించుకుని, ఆయన సౌజన్యంతో దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు కృష్ణప్రసాదు మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు సంస్కారం కూడా ముఖ్యమన్నారు. సెల్ ఫోన్లను విజ్ఞానం కోసం మాత్రమే ఉపయోగించాలన్నారు. చదువులో బాగా రాణిస్తే ఉజ్వల భవిత ఉంటుందన్నారు. ప్రభుత్వ పథకాలతో పాటు దాతల వితరణను సద్వినియోగం చేసుకుని అత్యుత్తమ ఫలితాలు సాధించాలన్నారు. జన్మదినం సందర్భంగా వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టిన లంకా లితీష్ ని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సేవా కార్యక్రమాలు ఇతరులకు స్ఫూర్తివంతంగా నిలిచాయన్నారు. ఎన్డీఏ మహాకూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ మద్యం కేసులో వ్యక్తి అరెస్ట్



**బంటుమిల్లి మేజర్ న్యూస్:** అక్రమ మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుండి 27 మద్యం సీసాలు స్వాధీనం చేస్తున్నట్లు స్థానిక ఎస్సై గణేష్ కుమార్ వెల్లడించారు. కృత్తి వెన్ను మండలం ఇంతేరు గ్రామానికి చెందిన నడకుదుటి కృష్ణ అక్రమ మద్యం తరలిస్తూ సోమవారం స్థానిక బస్టాండ్ వద్ద తనిఖీల లో బంటుమిల్లి పోలీసులకు చిక్కాడు. దీంతో నిందితుడు పై కేసు నమోదు చేసి నిందితుడు అరెస్టు చేసి అతని వద్ద 27 మద్యం సీసాలను స్వాధీనం చేసినట్లు ఎస్సై గణేష్ కుమార్ తెలిపారు. మండలంలో ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించిన కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై గణేష్ కుమార్ హెచ్చరించారు.

## దేవాలయాల్లో పోటెత్తిన జన సందోహం



**కంచికచర్ల నవంబర్ 4 మేజర్ న్యూస్ :** మండల కేంద్రంలో మండలంలోని గ్రామాల్లో కార్తీకమాస మొదటి సోమవారం తెల్లవారుజాము నుండి దేవాలయాల్లో భక్తులు పోటెత్తారు. బ్రహ్మ ముహూర్తం నుండే భక్తులు శివాలయాలలో దీపారాధన చేసి, తులసి పూజ గావించి, స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. దేవాలయాలు తెల్లవారుజాము నుండి భక్త జన సందోహంతో కిటకిటలాడాయి. స్థానిక శివాలయంలో భక్తులకు ప్రత్యేక క్యూ లైన్ ఏర్పాటు చేశారు. శ్రీ శివ సాయి క్షేత్రంలో భక్తులు క్యూలో నిలబడి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. హర హర మహాదేవ శంభో శంకర నామస్మరణతో ఆలయాలు మారుమ్రోగాయి. భక్తులు కార్తీక దీపాలు వెలిగించి తమ భక్తిని చాటుకున్నారు.



ఈ సందర్భంగా అర్చకులు మాట్లాడుతూ కార్తీక మాసం లో నిత్యం పరమ శివునికి విశేష పూజలు, ఏకాదశి రుద్రాభి షేకములు, పంచామృత అభిషేకములు, బిల్వార్చనలు జరుగుతాయని తెలిపారు.





## శామ్‌సంగ్ ఆర్ అండ్ డి ఇనిస్టిట్యూట్‌లో స్టేట్ ఆఫ్ ది ఆర్ట్ లింగ్విస్టిక్స్ ల్యాబ్ ఏర్పాటు

**విజయవాడ, మేజర్ న్యూస్ :** బెంగుళూరులోని శామ్‌సంగ్ ఆర్ అండ్ డి ఇనిస్టిట్యూట్, బెంగుళూరులోని గార్డెన్ సిటీ యూనివర్శిటీతో కలిసి 'శామ్‌సంగ్ స్టూడెంట్స్ ఎకో సిస్టమ్ ఫర్ ఇంజినీర్డ్ డేటా ల్యాబ్'ని ఏర్పాటు చేసింది. తద్వారా విద్యార్థులు, అధ్యాపకులకు ఏఐ, ఎంఎల్, డేటా ఇంజనీరింగ్ ప్రపంచంలోకి ప్రవేశించడానికి ఒక అద్భుతమైన అవకాశాన్ని అందిస్తుంది. శామ్‌సంగ్ ఇప్పటికే రెండు ల్యాబ్‌లు కర్ణాటకలో, రెండు ల్యాబ్‌లు తమిళనాడులో ప్రారంభించింది. ఏఐ, డేటా సంబంధిత ప్రాజెక్ట్‌లలో 400 కంటే ఎక్కువ మంది విద్యార్థులను నిమగ్నం చేసింది. "గార్డెన్ సిటీ యూనివర్శిటీతో మా వ్యూహాత్మక భాగస్వామ్యం మా ప్రయత్నాలను మరింత ముందుకు తీసుకువెళ్ళడంలో భాగంగా, భారతదేశం కోసం వినూత్న ఉత్పత్తులను రూపొందించడంలో కొత్త అవకాశాలను అన్వేషిస్తుంది" అని ఎస్ఆర్ఐ-బి చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ మోహన్ రావ్ గోలి పేర్కొన్నారు.

## అంగన్వాడి పోస్టులకు భర్తీ

### సిడిపిఓ భాగ్యా రేణుక

**నందిగామ, నవంబర్ 4, మేజర్ న్యూస్:** ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని వీరులపాడు మండలం జుజ్జూరు-6 అంగన్వాడి కేంద్రంలో సహాయకురాండ్ల పోస్టుకు దరఖాస్తులు చేసుకోవాలని సిడిపిఓ భాగ్య రేణుక ఒక ప్రకటనలో తెలిపారు.. బీసీ-ఈ మహిళ పోస్టుకు 2024 జూలై 1వ తేదీకి 21 సంవత్సరాల నుండి 35 సంవత్సరాల లోపు మహిళ పదో తరగతి ఉత్తీర్ణులరాలై ఉండాలని విద్యా అర్హత, నివాసం, కులం ఆధార్ జిరాక్సుతో నందిగామ ఐసిడిఎస్ కార్యాలయంలో ఈనెల ఎనిమిదో తేదీ 5 గంటల లోపు అందజేయాలని సిడిపిఓ భాగ్య రేణుక తెలిపారు.

## ప్రజా సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించాలి



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** జిల్లాలో ప్రజలు ఎదుర్కొనే ఎలాంటి సమస్య అయినా ధైర్యంగా వచ్చి ఫిర్యాదు చేసి, వారి సమస్యకు పరిష్కారం పొందవచ్చని, సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ఆర్. గంగాధరరావు అన్నారు. మీకోసం కార్యక్రమంలో ప్రజలు వారి యొక్క సమస్యలను ఎస్పికి అర్జీల రూపంలో విన్నవించుకోగా, వారి సమస్యలను విని, చట్ట పరిధిలో, నిర్ణీత సమయంలోపల పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

## దాళ్వా పంటకు సాగునీరు సరఫరా చేయటమే సబబు



**బంటుమిల్లి మేజర్ న్యూస్ :** రెండవ పంటకు దాళ్వాకు సాగునీరు సరఫరా చేయటమే సబబు టి.డి.పి రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ శాసనసభ్యులు బూరగడ్డ వేదవ్యాస్ వ్యాఖ్యానించారు. పెడన నియోజవర్గానికి రెండో పంటకు సాగునీరు అందించవలసిన అవసరం ఎంతైనా ఉందని బూరగడ్డ వేదవ్యాస్ అన్నారు.గత కొన్ని సంవత్సరాలుగా దాళ్వా పంట లేకపోవడం వల్ల పొలాలు చౌడు బారాయని అన్నారు. నియోజకవర్గంలో ప్రధానంగా తీర ప్రాంతమైన బంటుమిల్లి కృత్తివెన్ను ప్రాంతాలకు దాళ్వా అవసరం తప్పనిసరిగా ఉందన్నారు. గతంలో తాను శాసనసభ్యులుగా ఉన్నప్పుడు రిజర్వాయర్లలో నీరు తక్కువగా ఉన్నప్పటికీ దాళ్వాను మంజూరు చేయించానని వ్యాస్ తెలిపారు.కొన్ని ప్రాంతాల్లో అపరాలు పండే అవకాశం లేదని ఫలితంగా రైతులు రెండవ పంట నుంచి వచ్చే ఆదాయాన్ని కోల్పోతున్నారని బూరగడ్డ చెప్పారు. ఈ విషయాన్ని ఇప్పటికే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లాలని తెలిపారు. జిల్లా అధికారులు కూడా సముచిత నిర్ణయం తీసుకుని నియోజవర్గ రైతాంగాన్ని ఆదుకోవాలని అన్నారు.

## బాబా వారి ఆలయానికి వద్దన పాత్రలు అందజేత



**అవనిగడ్డ మేజర్ న్యూస్** : స్థానిక ఒకటో వార్డులో కొలువైన షిరిడి సాయి బాబా మందిరంలో భక్తులకు అన్నసంతర్పణ చేయుటకు గాను వంట పాత్రలను బహుమతిగా అందజేశారు. బియ్యం వ్యాపారి చెన్నగిరి ఆది శేష ( బుల్లెబ్బాయి), మల్లికాంబ దంపతుల మనుమడు చిరంజీవి లక్ష్మీ నాగ కృష్ణ జన్మదినం సందర్భంగా, బాబు తల్లిదండ్రులు మురళీ కృష్ణ, శ్వేత దంపతులు బాబా వారికి మూతలతో సహా ఆరు గిన్నెలు అందజేశారు. వీటిని ఆలయ ధర్మకర్త మండలి సత్య ప్రసాద్ కి అందజేశారు. ఈ సందర్భంగా సత్య ప్రసాద్ మాట్లాడుతూ బాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బాబు తల్లిదండ్రులకు, తాత నానమ్మలకు ధన్యవాదములు తెలియజేసారు.

## ఎమ్మెల్సీ ఓటు నమోదు శిబిరం వద్ద కూటమి నాయకులు



**అవనిగడ్డ, మేజర్ న్యూస్** : అవనిగడ్డ నియోజకవర్గంలోని ప్రతి ఒక్క గ్రాడ్యుయేట్ తప్పనిసరిగా నవంబర్ 6లోపు ఎమ్మెల్సీ ఓటును నమోదు చేసుకోవాలని టీడీపీ నియోజకవర్గ అబ్జర్వర్ కనపర్తి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం స్థానిక ఎమ్మార్వో కార్యాలయం వద్ద గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు నమోదుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శిబిరంలో అభ్యర్థుల నుండి ఓటు నమోదు దరఖాస్తులనుఆయన స్వీకరించారు. ఈ కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ అధికార ప్రతినిధి కొల్లూరు వెంకటేశ్వరరావు మాజీ ఎంపీపీ బండే కనకదుర్గ, బచ్చు కృష్ణకుమారి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వాములకు సద్ది ఏర్పాటుచేసిన గణేష్



**పామర్రు నవంబర్ 4 మేజర్ న్యూస్** : మండల కేంద్రమైన పామర్రు లో అయ్యప్ప మాల ధరించిన భక్తులకు తెలుగుదేశం పార్టీ జిల్లా రైతు అధ్యక్షుడు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వల్లూరుపల్లి గణేష్ కుమార్ సోమవారం మధ్యాహ్నం సద్ది(భోజనం) కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో అయ్యప్ప స్వాములు పాల్గొని సద్దిని స్వీకరించారు. అయ్యప్ప స్వాములకు గణేష్ కుమార్ గురుస్వామి స్వయంగా భోజనాన్ని వడ్డించారు.

## రాష్ట్రస్థాయి స్కిప్పింగ్ పోటీలకు పామర్రు హైస్కూల్ విద్యార్థుల ఎంపిక



**పామర్రు నవంబర్ 4 మేజర్ న్యూస్** : మండల కేంద్రమైన పామర్రులోని కంచర్ల రామారావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని,విద్యార్థులు 11 మంది రోప్ స్కిప్పింగ్ కృష్ణాజిల్లా జట్టుకు ఎంపికైనట్లు పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో పాఠశాలకు చెందిన బాల బాలికల జట్లకు ఎంపికైనట్లు ఆమె చెప్పారు. ఈనెల 8 నుండి 10వ తేదీ వరకు భీమవరంలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలలో కృష్ణా జిల్లా తరఫున ఈ విద్యార్థులు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. కాగా రాష్ట్ర పోటీలకు ఎంపికైన తమ పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు శిక్షణ అందించిన వ్యాయామ అధ్యాపకులు జి.మురళి, రవి కిషోర్ లను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, సిబ్బంది ఈ సందర్భంగా అభినందించారు.

# మానవ సేవా సంస్థ ఆధ్వర్యంలో సాఫ్ట్వేర్ కోర్స్‌లో ఉచిత శిక్షణ



**జగ్గయ్యపేట నవంబర్ 4, మేజర్ న్యూస్** : పట్టణంలో మానవ సేవా సంస్థ కార్యాలయంలో వ్యవస్థాపకులు వంగర సురేష్ కుమార్ ప్రకటన విడుదల చేయడం జరిగింది. గుంటూరు జిల్లా, బాపట్ల, ప్రకాశం, కృష్ణ జిల్లా, ఎన్టీఆర్ జిల్లా, పశ్చిమగోదావరి జిల్లాలలోని డిగ్రీ చదివిన, విద్యార్థినీ విద్యార్థులకు, నిరుద్యోగులకు శుభవార్త తెలిపారు. ఉచిత సాఫ్ట్వేర్ శిక్షణ కోర్స్ లో చేరడానికి అడ్మిషన్లు ఈ నెల 28 నుండి ప్రారంభం కానున్నాయి అని మానవ సేవా వ్యవస్థాపకులు వంగర సురేష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం 500 మంది విద్యార్థినీ విద్యార్థులకు ఉచితంగా సాఫ్ట్వేర్ కోర్స్ లో ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుంది అని అన్నారు. ఒక సాఫ్ట్వేర్ ఉద్యోగిగా విద్యార్థినీ విద్యార్థులకు నా వంతుగా విద్యారంగంలో సేవ చేయాలనే దృక్పథంతో ఉచితంగా సాఫ్ట్వేర్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వడం జరుగుతుంది అని అన్నారు. విద్యార్థిని విద్యార్థులు, గృహిణులకు, నిరుద్యోగులకు ఇది ఒక మంచి సదా అవకాశం అని అన్నారు. ఒక సాఫ్ట్వేర్ ఉద్యోగిగా విద్యార్థిని విద్యార్థులు మంచిగా అభివృద్ధి చెందాలని మంచి సూచనలతో మెరుగైన టెక్నాలజీలో ఉచితంగా శిక్షణ ఇచ్చి, వారిని ఉన్నత శిఖరాలకు చేరుకునే విధంగా శిక్షణ ఇచ్చి తగు సూచనలు కూడా ఇవ్వటం జరుగుతుంది ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోగలరు ఆయన అన్నారు. ఉచితంగా సాఫ్ట్వేర్ కోర్స్ శిక్షణ 28 సెప్టెంబర్ 2024 శనివారం ఉదయం.11 గంటలు నుండి మధ్యాహ్నం 2 గం వరకు, ఆదివారం ఉ. 11 గంటలు నుండి మ.2 గంటల వరకు జరుగుతాయి అని తెలిపారు. వివరాలకు 7093529750 ఈ ఫోన్ నెంబర్ సంప్రదించ వచ్చు అన్నారు. ఈ సాఫ్ట్వేర్ కోర్స్ లో 22 సంవత్సరాల అనుభవం గల ప్రాజెక్ట్ మేనేజర్ తో శిక్షణ ఇప్పించడం జరుగుతుంది అని తెలిపారు. దరఖాస్తుకు చివర తేదీ 28 సెప్టెంబర్ 2024 అని తెలిపారు. విద్యాఅర్హతలు ఎనీ డిగ్రీ (వయసు పరిమితితో పని లేదు ) తరగతి సమయం : ఉ 11 గంటల నుండిమ. 2 గం వరకు ప్రతి శనివారం (3 గంటలు), ఆదివారం (3 గంటలు) మాత్రమే తరగతులు జరుగుతాయి అని అన్నారు. కోర్స్ కాల పరిమితి : 3 నెలలు (14 వారాలు) గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లా విద్యార్థినీ విద్యార్థులకు మంగళగిరిలో క్లాసులు నిర్వహించ బడును స్థలం : మానవ సేవా సంస్థ ఆఫీస్ (మంగళగిరి) వి ఆర్ కాంప్లెక్స్,11-285, రత్నాలచెరువు అండర్ పాస్, దుర్గా నగర్, బైపాస్ రోడ్, ఓల్డ్ మంగళగిరి, గుంటూరు జిల్లా, ఏపీ – 522503. వివరాలకు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 7093529750 కృష్ణ,ఎన్టీఆర్,, పశ్చిమ గోదావరి జిల్లా విద్యార్థినీ విద్యార్థులకు విజయవాడలోని మానవ సేవా సంస్థ ఆఫీస్‌లో క్లాసులు నిర్వహించబడును. స్థలం : మానవ సేవా సంస్థ ఆఫీస్ ( విజయవాడ ) రామ్ స్నేహ ఎవెన్యూస్ ఫ్లాట్ నెంబర్ 208, ఎన్ హెచ్ –16 బైపాస్ రోడ్,కుంచనపల్లి,డి మార్ట్ పక్కన తాడేపల్లి. వివరాలకు సంప్రదించవలసిన ఫోన్ నంబర్లు : 7093529750,9985222857 మానవ సేవా సంస్థ 22 సం.లుగా రెండు తెలుగు రాష్ట్రాలలో సేవా కార్యకమాలు చేసుకుంటూ సుమారు 14 లక్షల మందికి ఉచితముగా వైద్య సేవలు, 900 పైగా ఉచిత వైద్య శిబిరాలు, 4500 మందికి ఉచిత కంటి ఆపరేషన్, 6000 మందికి ఉచితంగా కళ్ళద్దాలు,5000 మందికి ఉచితంగా విద్య, ఇంకా అనేక సేవా కార్యక్రమాలతో రాష్ట్ర మంతటా నేనున్నాను అంటూ మీ ముందుకు వస్తున్నాము అని మానవ సేవా సంస్థ అదే స్ఫూర్తితో ఉచితంగా సాఫ్ట్వేర్ కోర్స్ లో డిగ్రీ చదివిన నిరుద్యోగులకు శిక్షణ ఇస్తున్నాము అని తెలిపారు. ఎం ఎన్ సి కంపెనీలో ఉద్యోగ అవకాశాలు, అత్యధిక జీతం లభించు కోర్స్ అని తెలిపారు. గమనిక : ముందుగా నమోదు చేసుకున్న విద్యార్థినీ విద్యార్థులను మాత్రమే తరగతులకు అనుమతించబడును అని అన్నారు. ఈ సమాచారాన్ని మీ తోటి విద్యార్థినీ విద్యార్థులకు తెలియయపరచగలరు. ఫీజు వివరాలు : ఫీజు ఉచితం ( మీరు చెల్లించవలసిన ఫీజు రూ 30000 /– మీ తరుపున మానవ సేవ సంస్థ చెల్లిస్తుంది. కోర్స్ పూర్తిగా ఉచితం ) నిబంధనలు వర్తిస్తాయి. సర్వర్, మెటీరియల్ ఖర్చు విద్యార్థిని విద్యార్థులు చెల్లించవలేను. వివరాలకు సంప్రదించవలసిన మానవ సేవా సంస్థ ఫోన్ నెంబర్స్ 9985222857, 7093529750 డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ.మానవసేవ.ఇన్

## రాష్ట్ర మంత్రి సుభాష్ ను కలిసిన బీజేపీ నాయకులు



**మచిలీపట్నం మేజర్ న్యూస్** : సోమవారం మచిలీపట్నం విచ్చేసిన కార్మిక శాఖ మంత్రి, కృష్ణాజిల్లా ఇంచార్జ్ మంత్రి వాసంశెట్టి సుభాష్ ని మర్యాద పూర్వకంగా కలిసి ఎన్ డి ఏ కూటమిలో భాగంగా మిత్ర ధర్మం పాటించాలని బిజెపి నాయకులకు సముచిత స్థానం కల్పించాలని బిజెపి జిల్లా అధ్యక్షులు గుత్తికొండ రాజబాబు కోరారు వీరితోపాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పంతం వెంకట గజేంద్రరావు అసెంబ్లీ కన్వీనర్ సోడిశెట్టి బాలాజీరావు జిల్లా ప్రధాన కార్యదర్శి పుప్పాల రాము వైదిక్ పాండురంగారావు ధూళిపాల రాము సూరిశెట్టి హరికృష్ణ కంచర్లపల్లి రామారావు విన్నకోట సుబ్బారావు ఉన్నారు.

## మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన ఆర్‌డిఓ, కే స్వాతి



**మచిలీపట్నం, మేజర్ న్యూస్** : రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి వాసం శెట్టి శుభాష్‌కి ఆర్ అండ్ బి, అతిథి గృహంలో మొక్కను అందజేస్తున్న మచిలీపట్నం ఆర్డిఓ కే.స్వాతి.

## ఇంచార్జ్ మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్పీ



**మచిలీపట్నం మేజర్ న్యూస్** : ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం బాయిలర్స్, ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ మంత్రి, కృష్ణాజిల్లా ఇంచార్జ్ మంత్రి వాసంశెట్టి సుభాష్ సోమవారం మచిలీపట్నంలో పలు అభివృద్ది కార్యక్రమాల శంకుస్థాపనలో పాల్గొన్న సందర్భంగా మచిలీపట్నం విచ్చేయగా వారిని జిల్లా ఎస్పీ ఆర్. గంగాధర రావు ఆర్& బి గెస్ట్ హౌస్ లో మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేసి సాదర స్వాగతం పలికారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 78 ఫిర్యాదులు






**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్** : పోలీస్ కమిషనర్ వారి కార్యాలయంలో ఎన్.టీ.ఆర్. జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ఆదేశాలు మేరకు డి.సి.పి.లు కె. ఉమ మహేశ్వర రాజు, ఏ.బి.టి.ఎస్.ఉదయారాణి, క్రైమ్ డి.సి.పి. తిరుమలేశ్వర రెడ్డి, కృష్ణ మూర్తి నాయుడు "ప్రజా సమస్యల పరిష్కార వేదిక"( పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం) కార్యక్రమాన్ని నిర్వహించి బాధితులు నుండి వివిధ సమస్యలకు సంబంధించి మొత్తం 78 ఫిర్యాదులపై బాధితులతో మాట్లాడటంతో పాటుగా, దివ్యాంగులు, వృద్ధుల వద్దకు నేరుగా వెళ్ళి వారి సమస్యలు గురించి అడిగి తెలుసుకుని వాటిని త్వరితగతిన పరిష్కరించాలని ఫోన్ ద్వారా సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్.హెచ్.ఓ లతో మాట్లాడి సత్వరమే చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. సోమవారం అందిన ఫిర్యాదుల్లో నగదు లావాదేవీలకు సంబంధించినవి 11, భార్యాభర్తలు, కుటుంబ కలహాలకు సంబంధించినవి 13, భూవివాదాలకు సంబంధించినవి 1, వివిధ మోసాలకు సంబంధించినవి 29, వేధింపులకు సంబంధించినవి 12, దొంగతనాలకు సంబంధించినవి 02, సైబర్ నేరాలకు సంబంధించినవి 01, ఇతర చిన్న చిన్న వివాదాలు సమస్యలకు, సంఘటనలకు సంబంధించినవి 09, మొత్తం 78 ఫిర్యాదులును స్వీకరించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొని ఫిర్యాదులు పరిష్కరించుటలో సహకారాన్ని అందించారు.

# ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారమే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక





**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** ప్రజల సమస్యలను నిత్యం పరిష్కరించే దిశగా జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో గల కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం ఉదయం కమిషనర్ ధ్యానచంద్ర సూచన మేరకు అధికారులు నిర్వహించారు. ఈ సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అధికారులు 14 ఫిర్యాదులు అందుకున్నారు. కమిషనర్ ఆదేశాల మేరకు అధికారులు స్వీకరించిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరిస్తామని ఫిర్యాదులు అందించిన ప్రజలతో అన్నారు. ఈ సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అత్యధికంగా పట్టణ ప్రణాళిక విభాగం లో 5 అందుకున్నారు, ప్రజారోగ్యం 2, ఇంజనీరింగ్ 2, రెవిన్యూ విభాగం లో 3, ఎస్టేట్ విభాగంలో ఒకటి, వరదల సంబంధిత ఫిర్యాదులను అధికారులు అందుకున్నారు. ఈ సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్) డాక్టర్ బి చంద్రశేఖర్, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి సృజన, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబు శ్రీనివాస్, సుపరింటంగ్ ఇంజనీర్లు పి.సత్యనారాయణ, పి సత్య కుమారి, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్, డీఎఫ్ఓ మాల్యాద్రి, ఎస్టేట్ ఆఫీసర్ టీ శ్రీనివాస్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి.ఎస్.ఎస్ సోమశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

**పామర్రు నవంబరు 4 మేజర్ న్యూస్ :** కార్తీక మాసం మొదటి సోమవారాన్ని పురస్కరించుకుని మండల మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుండి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు విచ్చేసి దీపారాధనలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివాలయాల్లో అర్చకులు ప్రత్యేకంగా అభిషేకాలు నిర్వహించి పూజలు చేశారు. పామర్రు మండలంలోని దేవాలయాల్లో ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించడంతోపాటు తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. పామర్రు లోని బుచ్చమ్మ ఆశ్రమంలో గల శ్రీ పర్వత వర్ధినిదేవి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆలయ అర్చకుడు కుందుర్తి కార్తిక శర్మ ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శివ నామస్మరణంతో మార్మోగిన శైవ దేవాలయాలు

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** కార్తీక మాసం తొలి సోమవారాన్ని పురస్కరిం చుకుని దివిసీమలోని శివాలయాలు శివనామ స్మరణతో మార్మోగాయి. కార్తీక మాసం సందర్భంగా వేకువజామనే భక్తులు కృష్ణా నదిలో పుణ్య స్నానం చేసి శివాలయాలకు చేరుకున్నారు. స్థానికంగా ప్రాచీన శివాలయంగా పేరొందిన రాజరాజేశ్వరి సమేత రాజశేఖర స్వామి వారి దేవస్థానంలో స్వామివారికి ప్రత్యేక అలంకరణలు చేసి విశేష పూజలు అభిషేకాలు నిర్వహించారు. మండల పరిధిలోని వేకనూరు, మోదుమూడి, అశ్వరావు పాలెం, దక్షిణ చిరువోలు లంక గ్రామాలలోని శివాలయాలలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు అర్చనలు అభిషేకాలు నిర్వహించి విశేషంగా అలంకరించాగా, అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని లింగాష్టకం లలిత సహస్రనా మం పారాయణం సామూహికంగా నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులు భారీగా తరలి రావడంతో శైవ క్షేత్రాలు శివనా మస్మరణతో మార్మోగాయి. మండల పరిధిలోని దక్షిణ చిరువోలులంక కృష్ణానదీ పాయలో స్వయంగా వెలసిన బాల శివ శంకర్ భగవాన్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని విశేషంగా అలంకరించారు కార్తీక సోమవా రాన్ని పురస్కరించుకుని మండలం నుండే కా కుండా దూర ప్రాంతాల నుండి సైతం భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఆలయ ఆవరణ గల గణపతి స్వామికి




ప్రత్యేక పూజలు నిర్వ హించి నాగేంద్ర స్వామి పుట్టలో పాలు పోసి పసుపు కుంకుమ పళ్ళు పూలతో పూజ నిర్వ హించి భగవాన్ స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకురాలు గుడిసేవ విజయ లక్ష్మి క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం శరత్ ఋతువు కార్తీకమాసం శుక్లపక్షం తది య మొదటి కార్తీక సోమవారం సందర్భంగా స్వామివారికి విశేష నవవిధ అభిషేకాలు నిర్వ హించారు. ఆలయ ప్రధాన అర్చకులు స్వామి వారికి విశేష పూజలు అర్చనలు నిర్వహించి గోత్రనామాలతో పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ సందర్భంగా నిర్వహించిన అన్న సందర్భంగా ఆరువేల మంది భక్తులు పాల్గొని స్వీకరించారు భక్తులు కావలసిన ఏర్పాట్లను ఆలయ నిర్వాహకురాలు గుడిసేవ విజయలక్ష్మి స్వయంగా పర్యవేక్షించారు.

# మండల ఆర్యవైశ్య సంఘ ప్రమాణ స్వీకార మహోత్సవం



## సంఘం సభ్యులకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే సౌమ్య

**నందిగామ, నవంబర్ 4, మేజర్ న్యూస్ :** తాము సంపాదించిన దానిలో కొంత సొమ్మును ధార్మిక ఆధ్యాత్మిక సమాజ హిత సేవలో ఉపయోగించటంలో ఆర్యవైశ్యులు ప్రధాన భూమిక పోషిస్తున్నారని నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. స్థానిక శ్రీనివాసఆర్యవైశ్య కళ్యాణ మండపంలో నందిగామ మండల ఆర్యవైశ్య సంఘ ప్రమాణ స్వీకార మహోత్సవం ఘనంగా నిర్వహించారు. వాసవి కన్యకా పరమేశ్వరి పొట్టి శ్రీరాములు భరతమాత చిత్రపటాలకు పూజలు చేసి సంఘ సభ్యులు జ్యోతి ప్రజ్వలన చేశారు విశిష్ట అతిథులుగా పాల్గొన్న ఎన్టీఆర్ జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు బొగ్గవరపు వెంకట రాజారావు, అధ్యక్ష కార్యదర్శి కోశాధికారులు చవట నాగేశ్వరావు పద్ధతి సీతారామ గుప్తా మహంకాళి చంద్రశేఖర్ కార్యవర్గ సభ్యుల చే ప్రమాణస్వీకారం చేయించారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న తంగిరాల సౌమ్య నూతన



కార్యవర్గ సభ్యులను శాలువాతో సత్కరించి అభినందించారు. సౌమ్యులైన ఆర్యవైశ్య సభ్యులు సమాజహిత సేవ లోను ఆధ్యాత్మిక ధార్మిక కార్యక్రమాల్లో తమ వంతు సేవలందిస్తున్నారని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు చల్లా అనిల్ ఏచూరు రాము, ఊటుకూరు సత్యనారాయణ గుప్తా పబ్బతి రాజేష్ దుద్దు నాగేశ్వరావు, పులిపాటి శ్రీనివాసరావు, అనుములు పార్థసారథి, పులిపాటి లక్ష్మణరావు, చలపాటి పార్థ,వనమా బుల్లబ్బాయి, పారేపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు. నూతన ఆర్యవైశ్య సంఘ సభ్యులు కుటుంబ సభ్యులు శ్రేయోభిలాషులు ఘనంగా సత్కరించారు.

## పట్టభద్రులారా ఓటరుగా నమోదుకండి

### ఈ నెల 6 చివరి తేదీ..



**విజయవాడ మేజర్ న్యూస్ :** కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం మనందరికీ తెలిసినదే. డిగ్రీ పూర్తయిన విద్యావంతులు ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకొని, మన సమస్యలు పరిష్కరించే మంచి అభ్యర్థిని ఎమ్మెల్సీగా ఎన్నుకోవాలని విజయవాడ నగర మాజీ కార్పొరేటర్, చేయూత అధ్యక్షురాలు పిల్లి లక్ష్మీ తులసి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6వ తేదీ బుధవారంతో ఓటరు నమోదు సమయం ముగుస్తుందని ఆమె తెలిపారు. కొందరికి తీరిక లేక, మరికొందరికి తెలియక ఓటరుగా నమోదు చేసుకోవడం జరగడం లేదని, ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు వజ్రాయుధం లాంటిదని ఆమె తెలయజేశారు. మధురానగర్ వివి నరసరాజు రోడ్డు లో (ఫ్లైఓవర్ క్రింద) ఓంకార క్షేత్రం శ్రీ షిరిడి సాయిబాబా మందిర ప్రక్కన గల "చేయూత" కార్యాలయానికి వచ్చి, పట్టభద్రుల ఓటు నమోదు చేసుకోవలసినదిగా విద్యావంతులను ఆమె కోరారు. నమోదు చేసుకునేందుకు వచ్చే విద్యావంతులు డిగ్రీ/ప్రొవిజనల్/డిప్లొమా నకలు, ఆధార్ నకలు, పాస్ పోర్ట్ సైజ్ ఫోటో, ఓటర్ ఐడి నకలు పత్రాలను తప్పనిసరిగా తమ వెంట తీసుకురావాలని కోరారు.

## మాకు రక్షణ కల్పించండి..



**విజయవాడ మేజర్ న్యూస్ :** ప్రేమ పెళ్ళి చేసుకున్న తనకు తల్లిదండ్రులు నుంచి రక్షణ కల్పించాలని సరిధే భూమిక శ్రీ కోరారు. సోమవారం గాంధీ నగర్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాజమహేంద్రవరం రాజేంద్ర నగర్ కు చెందిన తాను అదే ప్రాంతానికి చెందిన పెనుమచ్చుల హరిప్రసాద్ తో గత కొంతకాలంగా ప్రేమించుకుంటున్నామని తెలిపారు. విషయం తెలుసుకున్న తమ తలిదండ్రులు మూడు సంవత్సరాల క్రితం హరిప్రసాద్ పై కేసులు పెట్టి జైలుకు పంపారని తెలిపారు. ఈ క్రమంలో అక్టోబర్ 29వ తేదీన ఏలూరులోని బహుజన సేన కార్యాలయంలో బౌద్ధ ధర్మ హిందూ మ్యారేజ్ యాక్ట్ ప్రకారం సామాజిక సమతా వివాహం చేసుకున్నామని తెలిపారు. నాటి నుంచి తామిద్దరినీ చంపేస్తామని తమ తలిదండ్రులు బెదిరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దయచేసి మా ఇద్దరినీ వేరు చేయెద్దని కోరుకుంటున్నాం.. ప్రభుత్వం చొరవ తీసుకొని అదికారులు, పోలీస్ డిపార్ట్మెంట్ వారు స్పందించి మాకూ రక్షణ కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో పెనుమచ్చుల హరిప్రసాద్, గుత్తుల సత్యనారాయణ పాల్గొన్నారు.

## నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరించాలి



**నందిగామ, నవం బర్ 4, మేజర్ న్యూస్:** రోడ్లు భవనాల శాఖ ఇంజనీర్ ఇన్‌చీఫ్ అధికారిని విజయవాడ కార్యాలయంలో ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కలిశారు. నందిగామ నియోజకవర్గంలోని పలు రోడ్ల ప్రధాన సమ స్యలను చర్చించి తక్షణమే వాటిపై దృష్టి కేంద్రీకరించి ప్రజల అసౌకర్యాలను తీర్చే దిశగా కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి వాసిరెడ్డి ప్రసాద్, తదితర నాయకులు పాల్గొన్నారు.

## చిన్నారిని ఆశీర్వదించిన ఎమ్మెల్యే పామర్రు



**నవంబర్ 4 మేజర్ న్యూస్ :** పామర్రు మండలం అడ్డాడ గ్రామంలో మాడెం జోజిబాబు కుమార్తె ప్రథమ పుట్టినరోజు వేడుకలలో పామర్రు శాసన సభ్యుడు వర్ల కుమార్ రాజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారి కుందన శ్రీ తో ఎమ్మెల్యే కేక్ కట్ చేయించారు. అనంతరం చిన్నారిని ఆయన ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు వల్లూరుపల్లి గణేష్ కుమార్, కుదరవల్లి ప్రవీణ్ చంద్ర, చాట్ల రమేష్, వీరంకి వెంకటేశ్వరరావు, పరసా సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



## బాధిత కుటుంబానికి ఎల్ఓసి చెక్కును అందజేత

**జగ్గయ్యపేట, నవంబర్ 4, మేజర్ న్యూస్ :** పట్టణంలో రంగస్వామి బజారుకు చెందిన బిల్లకంటి కార్తీక్ ఆరోగ్య పరిస్థితి బాగోలేక విజయవాడ అంకుర హాస్పిటల్‌లో జాయిన్ అవ్వడం జరిగింది. వారు కడు బీద కుటుంబం నుంచి వచ్చినవారు, వారికి రోజు గడవడం చాలా కష్టంగా ఉండటంతో వారు ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ ని ఆశ్రయించగా తాతయ్య స్పందించి హాస్పటల్ వారితో మాట్లాడి వైద్యానికి సరిపడా ఎస్టిమేషన్ వేయించి వెంటనే దానిని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వద్దకు తీసుకొని వెళ్లి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ముందస్తు వైద్య ఖర్చుల నిమిత్తం ఎల్ఓసి రూ.5,50,000లు మంజూరు చేయించి సోమవారం వారి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) అందజేశారు. పరిస్థితిని అర్థం చేసుకొని కార్తీక్ వైద్యానికి రూ.5,50,000లు మంజూరు చేయించిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య)కి ముఖ్యమంత్రి చంద్రబాబుకి బాధిత కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్లకు ఓటు నమోదు చేసుకోండి



**జగ్గయ్యపేట, నవంబర్ 4, మేజర్ న్యూస్ :** పట్టణంలో మెప్మా ఆఫీసులో ఎమ్మెల్సీ ఎన్నికలు ఓటు హక్కు ఎలా నమోదు చేయించాలి అనే దానిపై అవగాహన సదస్సు కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ మాట్లాడుతూ కృష్ణ –గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటు హక్కు నమోదు గడువు ఈనెల (నవంబర్) 6 వ తేదీ వరకు మాత్రమేనని అర్హులైన పట్టభద్రులంతా తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని కోరారు. ఫారం 18 పూర్తి చేయడంతో పాటు డిగ్రీ ప్రొవిజినల్ సర్టిఫికేట్ జిరాక్స్ కాపీ పై గెజిటెడ్ అధికారితో సంతకం చేయించి జతపరచాలన్నారు. అలాగే ఆధార్, ఓటర్ కార్డు జిరాక్స్ కాపీలను కూడా జత చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కట్టా వెంకట నరసింహారావు,పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి మైనేని రాధాకృష్ణ, జిల్లా సమైక్య సెక్రటరీ షేక్ నజీమున్, తెలుగుదేశం పార్టీ నాయకులు గెల్లా వైకుంఠేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి సరైన నిర్వచనం సీఎం చంద్రబాబు పాలన



**జి.కొండూరు, మేజర్ న్యూస్ :** మండలం వెంకటాపురంలోఅభివృద్ధికి సరైన నిర్వచనం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పాలన అంటూ మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు పేర్కొన్నారు. జి.కొండూరు మండలంలోని వెంకటాపురం గ్రామంలో రూ.25లక్షల ఎంపీ నిధులతో నిర్మించిన కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణాన్ని శాసనసభ్యులు కృష్ణప్రసాదు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు కృష్ణప్రసాదు మాట్లాడుతూ అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అన్నారు. ప్రాధాన్యత క్రమంలో నిధుల సౌలభ్యాన్ని బట్టి సమస్యలను పరిష్కరిస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే నియోజకవర్గంలో రూ.22.5 కోట్ల నిధులతో గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టినట్లు వెల్లడించారు. మైలవరం నియోజకవర్గ అభివృద్ధి కోసం సాధ్యమైనంత ఎక్కువగా నిధులు తీసుకువస్తున్నట్లు వెల్లడించారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటు హక్కు నమోదు, టీడీపీ సభ్యత్వ నమోదు చురుగ్గా చేయాలని కోరారు. ఎన్డీఏ మహాకూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ సభ్యత్వ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి






**జగ్గయ్యపేట,నవంబర్ 4, మేజర్ న్యూస్ :** పట్టణంలో సోమవారం తన నివాసంలో నూజివీడు నియోజకవర్గ రాష్ట్ర పరిశీలకుడు గింజుపల్లి రమేష్ ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి షేక్ అన్వర్, తెలుగుదేశం నాయకులు సూర్యదేవరవెంకట లక్ష్మీ నరసింహారావు(బుజ్జి)లకు డిజిటల్ సభ్యత్వాలను నెట్టెం శ్రీరఘురామ్ అందజేశారు. ఈ సందర్భంగా నెట్టెం శ్రీరఘురామ్ మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లాలో, నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వం పెద్ద ఎత్తున జరుగుతోందని అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున ఈ సభ్యత్వ కార్యక్రమంలో పాలుపంచుకుంటున్నారని కేవలం ఎనిమిది రోజుల్లోనే 10 లక్షల సభ్యత్వాలు రాష్ట్రవ్యాప్తంగా నమోదయాయని తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకున్న వారికి ఐదు లక్షల ప్రమాద బీమా, విద్య వైద్యం ఉపాధి అవకాశాలను తెలుగుదేశం కార్యకర్తలకు అందిస్తుందని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు.

# ఏసీఏ క్రికెట్ స్టేడియాన్ని సందర్శించిన ఎంపీ కేశినేని చిన్ని



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** ఏసీఏ తరపున మూలపాడులో సెంటర్ ఫర్ ఎక్సెలెన్స్ ద్వారా ఏడాది లోపు క్రికెట్ అకాడమీ ఏర్పాటు చేస్తామని ఎంపీ కేశినేని చిన్ని హామీ ఇచ్చారు. ఈ క్రికెట్ మైదానంలోని రెండవ గ్రౌండ్ నెల రోజుల్లో అందుబాటులోకి రానుంది. ఐపీఎల్, ఏపీఎల్ రావటం వల్ల క్రికెట్లో క్రీడాకారులకి చాలా అవకాశాలు వచ్చాయిగ్రామీణ ప్రాంతంలోని క్రికెట్ క్రీడాకారులను వెలికితీయటానికి ఏసీఏ కృషి చేస్తుంది... 175 నియోజకవర్గాల్లో క్రికెట్ గ్రౌండ్స్ లేని రూరల్ ప్రాంతాల్లో ఏసిఏ తరపున గ్రౌండ్స్ ఏర్పాటు చేయడానికి ప్రణాళిక సిద్ధం చేశాము... రాబోయే నాలుగేళ్లలో 175 నియోజకవర్గాల్లో ఏ రాష్ట్రంలో లేని విధంగా సెంటర్ ఫర్ ఎక్సెలెన్స్ క్రికెట్ అకాడమీలు ఏర్పాట్లు చేస్తాముత్వరలో మూలపాడు గ్రామానికి మంచి రోజులు రాబోతున్నాయి.. పరిస్థితులు అనుకూలిస్తే గోల్ఫ్ కోర్స్ వచ్చే అవకాశం ఉంది.. రాజధాని ప్రాంతంలో మంగళగిరి, మూలపాడులలో రెండు క్రికెట్ స్టేడియాలు ఉండడం ఆనందంగా ఉంది. ఈ రెండు స్టేడియాలను ఏడాదిలోపు అభివృద్ధి చేసి అందుబాటులోకి తీసుకువస్తాము. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్య ఏ సి ఏ అడ్మిన్ మేనేజర్ జి శ్రీనివాసరావు, కేడీసీఏ సెక్రటరీ ఎం రవీంద్ర చౌదరి కేడీసీఏ జాయింట్ సెక్రటరీ రజనీకాంత్ సూపర్వైజర్ సుధాకర్, ఇబ్రహీంపట్నం మండల పార్టీ అధ్యక్షులు రామినేని రాజా,,గరికపాటి శివ మాజీ ఎంపీపీ బలం బాబు మూలపాడు పార్టీ అధ్యక్షులు కాకి నాగరాజు, తదితరులు పాల్గొనడం జరిగింది.



## శివరాత్రి రంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన తన్నీరు నాగేశ్వరరావు

**జగ్గయ్యపేట,నవంబర్ 4, మేజర్ న్యూస్ :** మండలంలో చిలకల్లు గ్రామంలో శివరాత్రి రంగా పెద్ద కర్మ సందర్భంగా వారి స్వగృహం కి వెళ్లి వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్‌కి ఘన నివాళులర్పించిన వైస్సార్సీపీ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు



**పెనుగంచిప్రోలు, నవంబర్ 4, మేజర్ న్యూస్ :** మండలంలో తోటచర్ల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, మాజీ సొసైటీ అధ్యక్షులు వేముల నరసింహయ్య ఆకస్మిక మరణాన్ని చింతిస్తూ సోమవారం వారి ఇంటికి వెళ్లి వారి పార్దివదేహానికి జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మార్కపూడి గాంధీ,శామ్యూల్ తదితర స్థానిక నాయకులు పాల్గొని నివాళులు అర్పించారు.

# స్పందన మానసిక దివ్యాంగుల పాఠశాలలో పల్లంట్ల జన్మదినోత్సవ వేడుకలు




**గన్నవరం, నవంబర్ 4, మేజర్ న్యూస్ :** గన్నవరం హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో స్పందన మానసిక వికాస కేంద్రం (వికలాంగుల పాఠశాల)లో సోమవారం ఉత్తరాంధ్ర ముద్దుబిడ్డ సామాజిక వేత్త, వెహికిల్ ఫైనాన్స్ %ఁ% గ్రూప్స్ అధినేత పల్లంట్ల వెంకటరామారావు కి జన్మదినోత్సవం మానసిక దివ్యాంగుల మధ్యలో సంస్థ చైర్మన్ సంకాబత్తుల వెంకట్ కెక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ చైర్మన్ సంకాబత్తుల వెంకట్ మాట్లాడుతూ సామాజిక వేత్త,అందరివాడు,మంచి వ్యక్తి, విద్యావంతుడు సోదరులు పేవీఆర్ ఈ సమాజానికి అత్యుత్తమమైన సేవలను అందిస్తున్నారని ఇలాంటి వ్యక్తి శాసనసభ్యునిగా ఎన్నికై ప్రజలకు మరిన్ని సేవలు చెయ్యడానికి భగవంతుడు అవకాశం ఆశీస్సులు అందించాలని ఆయన ఆకాంక్షించారు. కుల, మత, రాజకీయలకు అతీతంగా పీవీఆర్ అన్నకు ప్రతి ఒక్కరూ ఆశీస్సులు అందించాలని పల్లంట్లి అన్న చేస్తున్న సేవాకార్యక్రమాలకు తాముంతా తోడుగా ఉంటామని వెంకట్ అన్నారు అనంతరం స్పందన బాలలకు మంచి భోజనాలతో పాటుగా పుస్తకాలు పెన్నులు, పెన్సిల్స్ స్వీట్లు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమం లో స్పందన సిబ్బంది పాల్గొన్నారు.

# రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించడానికి కృషి



**వైభవంగా మైలవరం ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటి ప్రమాణస్వీకారం**

**అభివృద్ధి కమిటీ చైర్మన్ చారుగండ్ల ప్రసాదు, డైరెక్టర్లుగా జెల్లి కృష్ణ, షేక్ షేహనాజ్ బేగం**

**ప్రభుత్వ ఆసుపత్రిలో ఎక్విప్ మెంట్స్ కు రూ.2లక్షల స్వంత నిధులు అందజేసిన కృష్ణప్రసాదు**

**జి.కొండూరు మేజర్ న్యూస్ :** మైలవరం ప్రభుత్వాసుపత్రి అభివృద్ధికి, రోగులకు అత్యున్నత స్థాయిలో మెరుగైన వైద్యసేవలు అందించడానికి అభివృద్ధి కమిటీ సభ్యులు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది అంకిత భావంతో పనిచేయాలని మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు కోరారు. మైలవరం ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్గా చారుగండ్ల ప్రసాద్, డైరెక్టర్లుగా జెల్లి కృష్ణ, షేక్ షేహనాజ్ బేగం సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. స్థానిక శాసనసభ్యులు కృష్ణప్రసాదు సమక్షంలో ప్రమాణ స్వీకారం మహోత్సవ కార్యక్రమం మైలవరంలోని ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలో అత్యంత వైభవంగా జరిగిందిముందుగా అన్న ఎన్టీఆర్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జ్యోతి వెలిగించి కార్యక్రమం ప్రారంభించారు. తొలుత ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ప్రభుత్వ ఆసుపత్రిలో తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. సిబ్బంది కొరత, క్లీనింగ్, అవసరమైన ఎక్విప్ మెంట్, సీసీ కెమెరాల ఏర్పాటు, సిబ్బంది పనితీరు గురించి చర్చించారు. ఆసుపత్రిని పరిశుభ్రంగా ఉంచాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని శాసనసభ్యులు వసంత కృష్ణ ప్రసాద్ ఆదేశించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు కృష్ణప్రసాదు మాట్లాడుతూ మైలవరం ప్రభుత్వ ఆసుపత్రిని 50 పడకలుగా మార్పు చేసి తన హయాంలో నూతన భవనాన్ని నిర్మించినట్లు పేర్కొన్నారు. రోగులకు, వైద్యులకు మధ్య అనుసంధానంగా కమిటీ సభ్యులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి రోగులు నిస్సంకోచంగా వచ్చే పరిస్థితిని ఆసుపత్రిలో కల్పించాలన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను ఆసుపత్రికి మంజూరు చేయించడానికి కృషి చేస్తానన్నారు. అలానే దాతల సాయంతో కూడా ఆసుపత్రిలో తగు సౌకర్యాలు కల్పనకు కృషి చేయాలన్నారు. తన వంతుగా రూ.2లక్షలను ఆసుపత్రిలో పరికరాల కోసం స్వంత నిధుల నుంచి అందజేశారు.

వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, ఎన్టీఆర్ జిల్లా ఇంచార్జ్ మంత్రి సత్యకుమార్ యాదవ్ దృష్టికి ప్రభుత్వ ఆసు పత్రి సమస్యలను తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు నాయకత్వంలో రోగులకు అత్యంత నాణ్య మైన వైద్యసేవలు అందిస్తామన్నారు. ఎన్టీఆర్ జిల్లాలో అత్యుత్తమ ఆసుపత్రిగా మైలవరం గవర్నమెంట్ హాస్పిటల్ కి మంచి పేరు తీసుకురావాలని సిబ్బందికి సూచించారు. అనంతరం మైలవరం తెలుగు యువత అధ్యక్షులు లంకా లితీష్ సౌజన్యంతో చిరు వ్యాపారులకు తోపుడుబండ్లు, దివ్యాంగులకు మూడు చక్రాల ట్రై సైకిళ్లు అందజేశారు. ఎన్టీఆర్ మహాకూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# లైట్లు, టార్పాలిన్లు లేని ట్రాక్టర్లకు జరిమానా



**పామర్రు నవంబర్ 4 మేజర్ న్యూస్ :** రాత్రి సమయాల్లో లైట్లు లేకుండా నడుస్తున్న ట్రాక్టర్లకు జరిమానా విధించినట్లు తోట్లవల్లూరు ఎస్సై ఎం. అర్జున్ రాజు తెలిపారు. లైట్లు లేకుండా రాత్రి సమయంలో ఇసుకలోడుతో నడపడమే కాకుండా పైన టార్పాలిన్ లు కప్పకపోవడంతో ఒక్కొక ట్రాక్టర్కు 600 రూపాయలు వంతున రెండు ట్రాక్టర్లకు మండల పరిధిలోని కళ్లెంవారిపాలెం ఇసుక ర్యాంపు వద్ద జరిమానాలు విధించినట్లు ఆయన చెప్పారు. ట్రాక్టర్ డ్రైవర్లు ఎవరైనా రాత్రి సమయాల్లో ఇసుకతోలడం నిబంధనలకు విరుద్ధమని అయినప్పటికీ కొంతమంది డ్రైవర్లు రాత్రి సమయాల్లో తోలుతున్నారన్నారు. వీరిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. అంతేగాక ఇసుక పై తప్పనిసరిగా టార్పాలిన్ లు కప్పాలని విజ్ఞప్తి చేశారు.

# వరద బాధితులను ఆదుకోవాలని వినతిపత్రం





**జగ్గయ్యపేట, నవంబర్ 4, మేజర్ న్యూస్ :** నియోజకవర్గంలోని వరద బాధితులను ఆదుకొని, ఆర్థిక సహాయం అందించాలని జిల్లా కలెక్టర్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు వినతి పత్రం చేరేలా చేయాలని శాసనసభ్యుల కార్యాలయంలో శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) కి, మండల తహసిల్దార్ కార్యాలయంలోను ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్ నియోజకవర్గ కార్య దర్శి గడ్డం రాంబాబు యాదవ్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల వచ్చిన వరదల జగ్గయ్యపేట పట్టణంలోని కొన్ని కాలనీలు నీట మునిగి ఫ్రిజ్లు, మోటార్లు, వాహనాలు, పలు ఎలక్ట్రానిక్ వస్తువులు పాడైపోయి, ప్రతి కుటుంబంలోనూ 50 వేల నుండి లక్ష రూపాయల వరకు నష్టం జరిగిందని, మున్నేరు మరియు చెరువుల వరద ప్రవాహ కారణంగా వత్సవాయి, జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు మండలాల్లోని అనేక వందల ఎకరాల పంట పొలాలలో ఇసుక మేట వేసి పంట పండించుకోవడానికి నిరుపయోగంగా అయ్యాయని, నియోజకవర్గంలోని కొందరు అధికారుల నిర్లక్ష్యం కారణంగా వరద నష్టం నియోజకవర్గ ప్రజలకు అందలేదని, జగ్గయ్యపేట పట్టణ మరియు నియోజకవర్గ వరద బాధితులకు వరద నష్టం కింద పరిహారం అందించా లని, వరద నష్టం నివేదికలు తయారు చేయడంలో నిర్లక్ష్యం వహించిన అధికారులను సస్పెండ్ చేయాలని కోరుతున్నారని అన్నారు. ఈ వినతి పత్రం పై ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందిస్తారని ఆశిస్తున్నట్లు ఆయన తెలియజేశారు.

**సమస్యలు తీర్చాలని ఆర్టీసీ కాలనీవాసుల వినతి.**

పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో నివాసముండే స్థానికులు నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య)కు కాలనీలోని సమస్యలు తీర్చాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ ప్రాంతంలో సిమెంట్ రోడ్లు ఏర్పాటు చేయాలని, మంచినీరు పైపులైన్లు వేయాలని, విద్యుత్ సమస్యను తీర్చాలని వినతి పత్రం అందజేశారు. దీనిపై స్పందించిన శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) కాలనీలో పర్యటించి సమస్యల పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు ఇస్తానని తెలియజేశారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత



**గన్నవరం, నవంబర్ 4, మేజర్ న్యూస్ :** గన్నవరం సెక్షన్ పరిధిలో ఈ రోజు ఉదయం 09:00 నుంచి మధ్యాహ్నం 1:00 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీ సి పి డి సి ఎల్ గుణదల కార్యనిర్వాహక ఇంజనీర్ పి. హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ ఉండని ప్రాంతాలు కేసరపల్లి, అజ్జంపూడి, బుద్ధవరం, బూతుమిల్లిపాడు, కొండపావులూరు, పురుషోత్తపట్నం,ఆ ప్రాంతాలలో సరఫరా నిలిపివేయబడును. కావున గృహ వినియోగదారులు, వ్యవసాయ వినియోగదారులు, వ్యాపార వినియోగదారులు పరిశ్రమల వినియోగదారులు అందరూ సహకరించగలరని వారు కోరారు.

**వ్యవసాయ వినియోగదారులకు విజ్ఞప్తి :** (వ్యవసాయ వినియోగదారులకు ఉదయం 5.00 గంటల నుంచి 9.00 గంటల వరకు, మధ్యాహ్నం 1.00 గంటల నుంచి సాయంత్రం 6:00 వరకు వ్యవసాయ కరెంటు ఇవ్వబడును.

## టీడీపీ నేత చెరుకూరి వెంకటకృష్ణకి మాతృవియోగం



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** ఇబ్రహీంపట్నం మండలంలోని గుంటుపల్లి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు, సొసైటీ మాజీ అధ్యక్షులు, మాజీ వైస్ ఎంపీపీ చెరుకూరి వెంకటకృష్ణ మాతృమూర్తి చెరుకూరి పర్వత వర్ధనమ్మ (85) సోమవారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు సోమవారం గుంటుపల్లి గ్రామంలోని వారి నివాసానికి విచ్చేసి ఆమె పార్థీవదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆమె పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థించారు. చెరుకూరి వెంకటకృష్ణని, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎన్డీఏ మహాకూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత ఇసుకకు సైతం అనుమతులు తప్పనిసరి

**8 ట్రాక్టర్ల పట్టివేత : తహసిల్దార్ జాహ్నవి**



**కంచికచర్ల నవంబర్ 4 మేజర్ న్యూస్ :** ప్రజల అవసరం ప్రభుత్వం ప్రకటించిన ఉచిత ఇసుకకు సైతం అనుమతులు తప్పనిసరి అని తహసిల్దార్ జాహ్నవి స్పష్టంగా తెలిపారు.కీసర టోల్ ప్లాజా వద్ద సోమవారం 8 ఇసుక ట్రాక్టర్లను తహసిల్దార్ పట్టుకున్నారు.కీసర మునేటి నుండి అను మతులు లేకుండా అక్రమంగా ఇసుకను రవాణా జరుగుతుందన్న సమా చారం తెలుసుకున్న ఆమె మెరుపు దాడులు చేసి టోల్ ప్లాజా వద్ద ఇసుక ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నారు. ట్రాక్టర్ల పై కేసు నమోదు చేసి సంబంధిత శాఖ అయిన మైనింగ్ వారికి అప్పజెప్పడం జరిగిందని తెలిపారు. ప్రజలు వారి అవసరాలకు కావలసిన ఇసుకను సంబంధిత సచివాలయాల్లో సాండ్ యాప్ ద్వారా అనుమతులు పొంది తద్వారా వచ్చిన బిల్లుతో మాత్రమే ఇసుకను తెచ్చుకోవాలని సూచించారు.మండలంలోని ఏటి పట్టు గ్రామాల నుండి అక్రమ ఇసుక రవాణా అయినట్లయితే సంబంధిత పంచాయతీ కార్యదర్శి,విఆర్వోలపై చర్యలు ఉంటాయని తహసిల్దార్ హెచ్చరించారు.



# నందిగామలో ఘనంగా నూతన యూకో బ్యాంకు శాఖ ప్రారంభోత్సవం







**వినియోగదారుల సేవలలో ముందంజలో ఉందన్న యూకో బ్యాంక్**

**ప్రారంభోత్సవానికి హాజరైన బ్యాంక్ అధికారులు, నందిగామ ప్రముఖులు**

**నందిగామ, నవంబర్ 4, మేజర్ న్యూస్:** పట్టణంలోని గవర్నమెంట్ హాస్పిటల్ రోడ్డులో ఎంఎస్ బిల్డింగ్‌లో నూతనంగా భారత ప్రభుత్వ రంగ సంస్థ యూకో బ్యాంక్ శాఖ ప్రారంభోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని యూకో బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ సీఈవో అశ్వని కుమార్ వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అతిథులుగా యూకో బ్యాంక్ హైదరాబాద్ జోనల్ మేనేజర్ యన్ శ్రీకాంత్, డిప్యూటీ జోనల్ మేనేజర్ శశి భూషణ్ రావు, ఏజీఎం సయ్యద్ ఇలియాస్ భాష, చీఫ్ మేనేజర్ జగదీష్, జోనల్ ఆఫీస్ నుండి కీర్తి కాంత్, పలువురు బ్యాంక్ ప్రముఖులు ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా డిప్యూటీ జోనల్ మేనేజర్ శశి భూషణ్ రావు మాట్లాడుతూ నవంబర్ 4 సోమవారం దేశవ్యాప్తంగా పది యూకో బ్యాంకు బ్రాంచీలను అందుబాటులోకి తీసుకొచ్చారని తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్లో యూకో బ్యాంకు సేవలను విస్తరించే భాగంలో హైదరాబాద్ జోనల్ పరిధిలో 90వ బ్రాంచ్‌ను నందిగామలో ప్రారంభించినట్టు తెలిపారు. త్వరలో మరిన్ని బ్రాంచ్‌లను విస్తరింప చేస్తామని తెలిపారు. ఈ సెప్టెంబర్ త్రైమాసి కానికి నాలుగు లక్షల 73 వేల కోట్లు బిజినెస్ చేరుకుందని, నికర లాభం 603కోట్లకు చేరిందని అన్నారు.

ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ ఏ గోపి మాట్లాడుతూ నందిగామ పరిసర ప్రాంత ప్రజలు యూకో బ్యాంకు అం దించే సేవలను ఉపయోగించు కోవాలని, తక్కువ వడ్డీ రేటుకు అన్ని రకముల లోన్ సౌకర్యాలు, వివిధ రకాల డిపాజిట్ ఖాతా సౌకర్యాలు ఉన్నాయన్నారు. ప్రత్యేక లాకర్ వసతి ఉందని అవసరమైన వారు బ్యాంకులో సంప్రదించాలని తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి బ్యాంకు అధికారులు, స్థానిక బ్యాంకు సిబ్బంది, పట్టణ ప్రముఖులు, వ్యాపారస్తులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యం







**22, 23 తేదీలలో కేంద్ర ప్రభుత్వ మహిళా ఉద్యోగినుల 6వ సమావేశం**

**జాతీయస్థాయిలో 200 మంది ప్రతినిధులు రాక**

**మహిళా ఉద్యోగుల సమస్యల పరిష్కారం పై విస్తృత చర్చ**

**పోస్టర్, లోగో ఆవిష్కరించిన శాసనమండలి సభ్యులు**

**కె.లక్ష్మణరావు, ఏపీ ఎన్జీజీవో రాష్ట్ర అధ్యక్షులు కె.వి. శివారెడ్డి**

**విజయవాడ మేజర్ న్యూస్ :** దేశవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ రంగ సంస్థలలో విధులు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు, పరిష్కారాలపై ఈనెల 22, 23 తేదీలలో 6వ జాతీయస్థాయి మహిళా సదస్సు మన నగరంలో నిర్వహించడం ఎంతో గర్వకారణమని శాసనమండలి సభ్యులు కె. లక్ష్మణరావు అన్నారు. గాంధీనగర్ లోని ఎన్జీజీవో హోమ్‌లో మహిళా సమావేశ నిర్వహణకు సంబంధించిన లోగో, వాల్ పోస్టర్లను ముఖ్య అతిధులు, ఏపీ ఎన్జీజీవో రాష్ట్ర అధ్యక్షులు కెవి శివారెడ్డి, కార్యదర్శి సిహెచ్ పురుషోత్తమ నాయుడు, ఎ.ఐ.ఎస్. జి.ఇ.ఎఫ్. కన్వీనర్ ఎం. రాజ్యలక్ష్మి లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు దశాబ్దాల కాలంలో దేశంలోని మహిళల్లో ఆత్మస్థైర్యం పెరగడం శుభ పరిణామం అన్నారు. గత మూడు దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న మహిళా రిజర్వేషన్ బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందేలా అన్ని రాజకీయ పార్టీలు ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. ఏపీ ఎన్జీజీవో రాష్ట్ర అధ్యక్షులు కె.వి.శివారెడ్డి మాట్లాడుతూ నగరంలో తొలిసారిగా నిర్వహిస్తున్న మహిళా సదస్సుకు రాష్ట్ర ఎన్జీవో తరపున సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అఖిలభారత మహిళా ఉద్యోగుల విభాగం కన్వీనర్ ఐ.సుశీలా రాణి మాట్లాడుతూ దేశంలోని వివిధ రాష్ట్రాలలో కేంద్ర ప్రభుత్వం అధీనంలో ఉన్న శాఖలలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగుల సమస్యలపై కాన్ఫెడరేషన్ ఆఫ్ సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయిస్, కార్మికుల సంఘం మహిళలు ఎదుర్కొంటున్న ఎన్నో ఇబ్బందులపై గత ఐదు సంవత్సరాలుగా వివిధ రాష్ట్రాలలో సదస్సులు నిర్వహించిందని తెలిపారు. ఈ దఫా తెలుగు రాష్ట్రాలలో నిర్వహించేందుకు కేంద్ర కమిటీ తీసుకున్న నిర్ణయాన్ని తాము స్వాగతిస్తున్నామన్నారు. ముఖ్యంగా కొన్ని రాష్ట్రాలలో కేంద్ర ప్రభుత్వ మహిళా ఉద్యోగులు కనీస వసతులు కూడా లేకుండా విధులు నిర్వహిస్తున్నారన్నారు. అటువంటి సమస్యలను, సహేతుకమైన పరిష్కారాలను జాతీయ స్థాయి నాయకులు ఈ సదస్సులో చర్చిస్తారన్నారు. మహిళా ఉద్యోగులు సురక్షితమైన వాతావరణంలో ఉద్యోగ బాధ్యత నిర్వహించేందుకు, వారికి ఇబ్బంది కలిగిన సమయంలో చట్టపరంగా వారికున్న హక్కుల పట్ల అవగాహన కల్పించడం ఈ సదస్సు ముఖ్య లక్ష్యమన్నారు. పోరంకి సమీపంలోని మురళి గార్డెన్స్‌లో నిర్వహించనున్న ఈ సదస్సుకు ఆహ్వాన కమిటీ కన్వీనర్‌గా కల్లం పున్నారెడ్డి, ఎం శుభాకరరావు వ్యవహరిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆహ్వాన కమిటీ వర్కింగ్ చైర్మన్ బి. శ్రీధర్ బాబు ఆదాయ పన్ను శాఖ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఉద్యోగుల ఫెడరేషన్ కార్యదర్శి కెవి రమణ రావు, ప్రధాన కార్యదర్శి గౌతం కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బందర్ రోడ్డు వెంబడి ఉన్న ఆక్రమణలు తొలగింపు











**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ :** బందర్ రోడ్డుపై ఆకర్లు ఏదో వ్యాపారాలు చేయు వారు రోడ్డును ఆక్రమించి వ్యాపారాల నిర్వహించడం వలన సదరు రహదారులపై ట్రాఫిక్ రద్దీ విపరీతంగా పెరిగిపోతుంది, రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. రహదారులపై ట్రాఫిక్ రద్దీని తగ్గించి రోడ్డు ప్రమాదాల నివారించాలనే సదుద్దేశంతో పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ఆదేశాల మేరకు ట్రాఫిక్ డీసీపీ, కృష్ణమూర్తి నాయుడు, ఏ డి సి పి ఏ వి ఎల్ ప్రసన్నకుమార్ పర్యవేక్షణలో ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ యు. రామారావు వారి సిబ్బందితో కలిసి ఎన్టీఆర్ సర్కిల్ నుండి ఆటోనగర్ గేట్ వరకు బందర్ రోడ్డు వెంబడి ఉన్న ఆక్రమణలను తొలగించి హాకార్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు.

18 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు
ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999